పసిడి రుణాలకు కళ్లెం!

నిబంధనలను కఠినతరం చేసే యోచనలో రిజర్వుబ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 7: పసిడి రుణాలకు కళ్లెం వేయడానికి రిజర్వు బ్యాంక్ సిద్ధమవుతున్నది. ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటున్న గోల్డ్ లోన్లకు చెక్ పెట్టడానికి త్వరలో కఠిన నిబంధనలను అమలులేకి తేవాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు జారీ చేస్తున్న గోల్డ్ లోన్లపై నిఘా పెట్టాలని సూచించింది. గోల్డ్ లోన్ తీసుకున్నవారు ఈ నిధులను దేనికి వినియోగిస్తున్నారు.. అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు సూచించింది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన సెంట్రల్ బ్యాంక్.. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే రుణాలు అత్యధికంగా తీసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాలు వారు దేనికి వినియోగిస్తున్నారన్న విషయంపై మానిటర్ చేయాలని సూచించింది. రుణాలు తీసుకున్నవారి కుటుంబ వివరాలు, పసిడి వారిదేనా లేకపోతే ఇతరవారు వీరిపై తీసుకుంటున్నారా అనేదానిపై సమాచారం సేకరించాలని పేర్కొంది. ఇటీవలకాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి పేరుమీద తీసుకొని ఇతర పెట్టుబడులు పెడుతున్నారనే సమాచారం ఆధారంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించనియెడల ఈ బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది.

ఆరు నెలల్లో 50 శాతం వృద్ధి

పసిడి తాకట్టుపై రుణాలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సెంట్రల్ బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పసిడి రుణాలు 50 శాతం పెరిగాయి. పసిడి వినియంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్లో గోల్డ్ లోన్లకు అత్యధిక మంది ఆకర్షితులవుతున్నారు. గతేడాది సెప్టెంబర్లో ఎన్బీఎఫ్సీల గోల్డ్ లోన్లపై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. గడిచిన 12 నుంచి 16 నెలల మధ్యకాలంలో నాన్-బ్యాంకింగ్ సంస్థలు జారీ చేసిన గోల్డ్ లోన్లపై ఆర్బీఐ ఆడిటింగ్ నిర్వహించగా, దీంట్లో ఎన్నో అనుమానాలు తలెత్తాయని, తీసుకున్నవారిలో సగానికి పైగా మంది వేరే అవసరాలకు వినియోగించారనే అనుమానం వ్యక్తంచేసింది.

ఐఐటీ హైదరాబాద్తో కోలిండియా జట్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, ఉద్గార రహిత బొగ్గు, ఇంధనాలపై పరిశోధనలకోసం ఐఐటీ హైదరాబాద్తో కోల్ ఇండియా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.98 కోట్ల గ్రాంట్తో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో(క్లీన్జ్) సంస్థను ఐఐటీహెచ్లో నెలకొల్పేందుకు ఇరు సంస్థలు జట్టుకట్టాయి. శుక్రవారం హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్రెడ్డి సమక్షంలో కోలిండియా సీఎండీ పీఎం ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర బీఎస్ మూర్తిలు పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్రెడ్డి మాట్లాడుతూ.. దేశ వృద్ధికి బొగ్గురంగం అతి ముఖ్యమైనదని, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన వనరుగా కొనసాగుతున్న గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదన్నారు.

ఉత్పాదక వ్యయం తగ్గాలి: సింగరేణి సీఎండీ బలరాం

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే సంక్షేమం సాధ్యమని, ఉద్యోగుల పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణిభవన్లో 38వ స్ట్రక్చర్ మీటింగ్ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి బొగ్గు విక్రయ ధరలు కోల్ ఇండియా, విదేశీ బొగ్గు కన్నా అధికంగా ఉన్నాయని, దీంతో ఈ బొగ్గుకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నదని, ఇది ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. బొగ్గు ఉత్పాదక వ్యయం రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందన్నారు.

పెన్షన్ మొత్తాన్ని పెంచండి

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్రెడ్డి, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాంలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు రామచందర్రావు తెలిపారు.

కొలువులు ఆగమాగం

అన్ని రంగాలకూ ట్రంప్ సుంకాల సెగ • ఆందోళనలో ఉద్యోగుల భవిష్యత్తు

ఇప్పటికే మందగమనంలో దేశ జీడీపీ వృద్ధి • గుబులు పుట్టిస్తున్న కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా అధ్యక్షుడి పోకడ.. ఆయా దేశాల్లో పెద్ద ఎత్తునే ఉద్యోగుల ఉసురు తీసేలా ఉన్నది. ఆ జాబితాలో భారత్ కూడా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అవును.. ఇప్పటికే ద్రవ్యోల్బణం, తయారీసహా కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు మందగమనం, అధిక వడ్డీరేట్ల వంటి సమస్యలతో సతమతమవుతున్న దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్పై సుంకాలుంటాయంటున్న ట్రంప్ ప్రకటనలు నిజమైతే.. ఇండస్ట్రీ కుదేలవడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ముఖ్యంగా భారతీయ తయారీ, ఎగుమతుల రంగాలకు గట్టి ఎదురు దెబ్బేనంటున్నారు.

ఇదీ సంగతి..

'ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే దూరం' అంటున్నారు యూఎస్ బాస్ ట్రంప్. దీంతో ఆయా రంగాల్లో ఇప్పుడు అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు తగ్గట్టుగా భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా సుంకాలను వేయనున్నది. భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ విషయానికే వస్తే.. ట్రంప్ సుంకాల ప్రభావం దీనిపై భారీగానే ఉండే వీలున్నది. ప్రస్తుతం భారతీయ నగలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో అక్కడికి మన ఎగుమతులు భారీగానే జరుగుతున్నాయి. అయితే సుంకాలు పెంచితే వీటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. దాంతో వ్యాపారాలకు దెబ్బే. అమెరికా నుంచి భారత్కు వస్తున్న జ్యుయెల్లరీపై వాటి విలువలో కేంద్ర ప్రభుత్వం 20 శాతాన్ని సుంకాలుగా వసూలు చేస్తున్నది. కానీ భారత్ నుంచి అమెరికాకు చేరుతున్న నగలపై అక్కడ పడుతున్నది గరిష్ఠంగా 5.5-7 శాతమే. ఇక సానబెట్టిన వజ్రాలపై ఇక్కడ 5 శాతం సుంకం పడితే.. అమెరికాలో ఏమీ లేదు. ఈ లెక్కన ట్రంప్ హెచ్చరించినట్టుగా సుంకాలు పడితే జెమ్స్ అండ్ జ్యుయెల్లరీ ఇండస్ట్రీ కుదేలైనట్టే. దేశంలో 2 లక్షలకుపైగా జనాభా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నది. వీరిలో మహిళలే ఎక్కువ. ఇప్పుడు టారిఫ్ల సెగ వీరందరికీ తగులుతున్నట్టే. ఇలాగే అనేక రంగాల పరిస్థితి నెలకొన్నది.

ఐటీ రంగానికీ తిప్పలే

భారతీయ ఐటీ రంగానికున్న ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. అయితే తొలిసారి అగ్రరాజ్య అధ్యక్షుడైనప్పుడే దేశీయ ఐటీ రంగాన్ని ట్రంప్ తీవ్రంగా దెబ్బతీశారు. వీసా నిబంధనలు కఠినతరం, ప్రాజెక్టుల్ని దూరం చేయడం, అమెరికాలో అమెరికన్లతోనే పనిచేయించాలనడం వంటివి ఇండియన్ ఐటీ ఇండస్ట్రీకి ఇబ్బందుల్ని తెచ్చిపెట్టాయి. ఇక్కడి ఐటీ ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేశాయి. అమెరికాలోనూ భారతీయులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. మళ్లీ ఇప్పుడు ట్రంప్ రావడంతో ఐటీ రంగంలోనూ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఇప్పటికే ఏఐ దెబ్బకు రిక్రూట్మెంట్లు మందగించిన విషయం తెలిసిందే. మొత్తానికి ట్రంప్.. ప్రధాని మోదీకి మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ.. దేశ ప్రయోజనాలే ముందు అంటున్నారు ట్రంప్. నిజానికి అమెరికా మోటర్సైకిళ్లు, విస్కీలపై 20 నుంచి 50 శాతం మేర సుంకాలను కేంద్రం తగ్గించింది. మరికొన్నింటిపైనా సమీక్ష జరుపుతున్నది. మరోవైపు వాణిజ్య మంత్రి గోయల్ అమెరికాలో చర్చల కోసం వెళ్లారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయో చూడాల్సిందే.

జాబ్ మార్కెట్ మటాష్!

ఇటీవలికాలంలో జాబ్మార్కెట్ అల్లకల్లోలంగానే తయారైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) దెబ్బకు ఉద్యోగావకాశాలు భారీగానే కోల్పోవాల్సి వస్తున్నది. దీనికితోడు దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా కొత్త నియామకాలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలను పెంచితే.. ఆ ప్రభావం అక్కడి మార్కెట్లో మన వస్తువులకున్న డిమాండ్ను తప్పక ప్రభావితం చేయగలదు. ఇదే జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి ఎగుమతులు పడిపోయి.. ఉత్పత్తి మందగిస్తుంది. దాంతో అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులేనన్నది మార్కెట్ నిపుణుల విశ్లేషణ. నిజానికి కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే మార్కెట్ కోలుకుంటున్నది. ఈ సమయంలో ట్రంప్ సుంకాల పిడుగు అంగట్లో గట్టిగానే అలజడులను సృష్టిస్తున్నదని చెప్పవచ్చు.

సుంకాలతో ఇబ్బందులు	ప్రభావిత రంగాలు	ఉపశమనం ఎలా?
భారంగా ఎగుమతుల ఖర్చులు	రత్నాలు, ఆభరణాలు	తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
పడిపోనున్న మార్కెట్ వాటా	ఫార్మా ఇండస్ట్రీ	పరిశ్రమలకు పన్ను మినహాయింపులు
తయారీ రంగం కుదేలు	ఉక్కు, అల్యూమినియం	సులభంగా రుణ లభ్యత
ఉద్యోగుల తొలగింపులు	టెక్స్టైల్స్ పరిశ్రమ	విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
ఆర్థిక వ్యవస్థలో మందగమనం	ఎలక్ట్రానిక్స్	వినియోగదారుల కొనుగోలు శక్తి బలోపేతం

- *టారిఫ్ల దెబ్బకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 2 నుంచి 7 బిలియన్ డాలర్ల మేర పడిపోయే అవకాశం ఉందంటున్న ఇండియా రేటింగ్స్.*
- ***ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్లో అమెరికాకు భారత ఎగుమతులు గతంతో పోల్చితే 5.57 శాతం పెరిగి 59.93 బిలియన్ డాలర్లుగా నమోదు. అమెరికా నుంచి దిగుమతులు కూడా 1.91 శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరిక.***
- *అమెరికా పెంచే సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు 5 నుంచి 10 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్న ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్.*

మహిళలకు ఎస్బీఐ చౌక రుణాలు

'నారీ శక్తి' డెబిట్ కార్డు పరిచయం

ముంబై, మార్చి 7: ఔత్సాహిక మహిళా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని శుక్రవారం ఎస్బీఐ ప్రకటించింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో 'అస్మిత' పేరిట ఈ ప్రత్యేక లోన్లకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం శ్రీకారం చుట్టింది. బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు వేగంగా, సులభంగా ఈ రుణాలను అందజేస్తామన్నారు. ఇదిలావుంటే 'నారీ శక్తి' ప్లాటినమ్ రూపే డెబిట్ కార్డునూ ఎస్బీఐ ఈ సందర్భంగా తీసుకొచ్చింది.

బీవోబీ నయా అకౌంట్స్

ప్రవాస భారతీయ మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం 'బోవోబీ గ్లోబల్ వుమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్వో సేవింగ్స్ అకౌంట్'ను అందుబాటులోకి తెచ్చింది. గృహ, వాహన రుణాలపై చౌక వడ్డీ, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు, లాకర్ అద్దెపై 100 శాతం రాయితీ, ఎయిర్పోర్టుల్లో ఉచితంగా దేశీయ, అంతర్జాతీయ లాంజ్ సౌకర్యం పొందేలా కస్టమైజ్డ్ డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ఈ ఖాతాదారులకుంటాయి.

ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక క్లస్టర్లు

రాష్ట్ర మంత్రి శ్రీధర్బాబు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాండ్ను విశ్వవ్యాప్తం చేసేందుకుగాను ఎంఎస్ఎంఈలకోసం ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు అన్నారు. ఎఫ్టాప్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్లో 'ఎంఎస్ఎంఈ స్పార్క్-2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

తల్లిని చంపిన తనయుడు

కుటుంబ కలహాలే కారణం

రేవతి(ఫైల్)

ఎల్కతుర్తి, మార్చి 7: తల్లిని అత్యంత కర్కశంగా గొడ్డలితో నరికి చంపిన కుమారుడి ఉదంతం శుక్రవారం రాత్రి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన చదిరం రేవతి(40) భర్త కుమారస్వామి 14 ఏండ్ల క్రితమే మృతి చెందగా, అప్పటి నుంచి పెద్ద కుమారుడు అజయ్, చిన్న కుమారుడు విజయ్ని పెంచి పెద్ద చేసింది. వీరిలో విజయ్ హైదరాబాద్లో ఉంటున్నాడు. పెద్ద కుమారుడు అజయ్(21) కి కొద్ది నెలల క్రితం వివాహం జరుగగా, గ్రామంలోనే కూలీ పని చేసుకుంటూ తల్లితో కలిసి జీవిస్తున్నాడు. అయితే వీరికి కొద్ది నెలలుగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఘర్షణ జరిగి కోపోద్రిక్తుడైన అజయ్ ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకొచ్చి తల్లి రేవతి మెడపై విచక్షణారహితంగా నరికాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎల్కతుర్తి సీఐ పులి రమేశ్, ఎస్సై ప్రవీణ్కుమార్లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా నిందితుడు పరారీలో ఉన్నాడని, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో 9న ఉమ్మడి జిల్లాస్థాయి ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు హనుమకొండ సెంట్రల్ కాంప్లెక్స్ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విజేతలకు నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేస్తామన్నారు. క్రీడాకారులు తమ పేర్లు శనివారంలోగా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90595 22986 నంబర్లో సంప్రదించాలని కోరారు.

కాజీపేట మీదుగా స్పెషల్ రైలు

కాజీపేట, మార్చి 7 : కాజీపేట మీదుగా హోలీ స్పెషల్ రైల్ను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. చర్లపల్లి-రక్సెల్-చర్లపల్లి మధ్య వారాంతంలో నాలుగు ట్రిప్పులు నడిపిస్తున్నట్లు చెప్పారు. చర్లపల్లి నుంచి ఈ నెల 11, 18న రాత్రి 9.00 గంటలకు స్పెషల్ రైలు(07713) బయలు దేరి రెండో రోజు ఉదయం 10.50 గంటలకు రక్సెల్ చేరుకుంటుంది. రక్సెల్ రైల్వేస్టేషన్ నుంచి 07714 నంబర్తో ఈ నెల 15, 21వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి రెండో రోజు ఉదయం 07.30 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. రాకపోకల్లో జనగామ, కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్నగర్, బల్లార్షా, గోండియా, బలాఘాట్, నైనిపూర్, మదన్మోహల్, కట్నీ, మైహార్, సట్నా, మాణిక్పూర్, ప్రయాగ్రాజ్ చోకి, పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ, బాక్సర్, ఆగ్రా, పాటలీపుత్ర, హాజీపూర్, ముజఫర్పూర్, సితీ మహతి రైల్వే స్టేషన్లలో ఆగుతుందని తెలిపారు.

నేడు కేయూ మహిళా ఉద్యోగులకు సెలవు

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కాకతీయ యూనివర్సిటీ మహిళా (బోధన, బోధనేతర) ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్ ఇస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. విశ్వవిద్యాలయ ఉద్యోగినులు గమనించాలని పేర్కొన్నారు.

పీజీ పరీక్షల్లో 10 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : కాకతీయ యూనివర్సిటీ పీజీ (రెగ్యులర్) మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 10 మందిని డిబార్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి కట్ల రాజేందర్ తెలిపారు. హనుమకొండ కాకతీయ డిగ్రీ కాలేజీ పరీక్ష కేంద్రంలో ఐదుగురు, మాస్టర్జీ డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఐదుగురిని మాల్ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు, వీరిపై నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు
- రూ. 2.68 లక్షల నగదు, రూ. 5 లక్షల విలువైన గోల్డ్, మూడు సెల్ఫోన్లు స్వాధీనం

నిందితుడి అరెస్టు చూపిస్తున్న ఏసీపీ దేవేందర్రెడ్డి

సుబేదారి, మార్చి 7 : ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని అమాయకులను మోసం చేసి లక్షల రూపాయలు, బంగారు ఆభరణాలు స్వాహా చేసిన నిందితుడిని హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ. 2.68లక్షల నగదు, రూ.5లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఏసీపీ దేవేందర్రెడ్డి నిందితుడి అరెస్ట్ చూపించి వివరాలు వెల్లడించారు. ఏపీలోని కడప జిల్లా వీరపునాయుని పల్లి మండలం, కొత్తపల్లి గ్రామానికి చెందిన కొమ్మ వివేకానందరెడ్డి అలియాస్ కిశోర్రెడ్డి కొంత కాలం ప్రైవేట్ టీచర్గా పనిచేసి జల్సాలకు అలవాటుపడ్డాడు. కొంతకాలంగా అతడు హనుమకొండలో నివాసం ఉంటూ, పేరు మార్చుకొని ప్రైవేట్ టీచర్గా పనిచేస్తూ, పరిచయం ఉన్న మహిళా ఉపాధ్యాయురాలికి వరంగల్ నిట్లో ల్యాబ్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ. 8 లక్షలు తీసుకున్నాడు. ఆమె కుమారుడికి నిట్లో సీటు ఇప్పిస్తానని 60 గ్రాముల గోల్డ్ తీసుకొని మకాం మార్చాడు. ఇదే రీతిలో మరో ఇద్దరి నుంచి నిందితుడు ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం హనుమకొండలోని వివేకానందరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం అంగీకరించాడు. అతడిపై ఏపీలో మూడు కేసులు ఉన్నాయి. నిందితుడిని పట్టుకున్న హనుమకొండ, టాస్క్ఫోర్స్ పోలీసులను ఏసీపీ అభినందించారు.

పాత కక్షలతో దాడి

పర్వతగిరి, మార్చి 7: పాత కక్షలను మనసులో పెట్టుకొని ఇంటికొచ్చి దాడి చేసిన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలకేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గూడెల్లి పద్మకు ఇద్దరు కుమారులు రంజిత్, వెంకటేశ్ ఉన్నారు. అత్త ఉప్పలమ్మ బాగోగులు చూసుకునేందుకు మాట్లాడుకుందామని పద్మ తోటి కోడళ్లు గుర్తుతెలియని వ్యక్తులను తీసుకొని ఇంటికొచ్చారు. ఈ క్రమంలో పద్మను దూషిస్తూ ఇంటిపై ఇటుకలతో దాడి చేయగా, ఆమెతోపాటు ఇద్దరు కుమారులకు గాయాలయ్యాయి. వారించిన తమను మామునూరుకు చెందిన కానిస్టేబుల్తోపాటు కట్ట భిక్షపతి, కట్ట భూపాల్, మంద రవితేజ పిడుగుద్దులతో రెచ్చిపోయి కత్తితో పొడిచి చంపుతామని బెదిరించారని ఆరోపించారు. ఈ మేరకు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు చెప్పారు. గాయపడిన వారిని వరంగల్లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు.

ఈదురు గాలులతో పంట నష్టం

మహబూబాబాద్ రూరల్, మార్చి 7 : మండల శివారులోని శుక్రవారం సాయంత్రం బలంగా ఈదురు గాలులు వీచి పంటకు నష్టం వాటిల్లింది. బిచ్చా తండాలో కౌలు రైతు బోడ వాలి ఎకరం పొలం కౌలుకు తీసుకుని మక్కజొన్న చేను సాగు చేయగా, ఈదురు గాలులతో మొత్తం నేలవాలిపోయింది. రూ. 35 వేలు పెట్టుబడి పెట్టి తీరా చేతికి వచ్చే సమయంలో అక్కరకు రాకుండా పోయిందని వాపోయారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి తగిన నష్టం పరిహారం వచ్చే విధంగా చూడాలని మహిళా రైతు కోరారు.



నేలవాలిన మక్కజొన్న

ప్రభుత్వ దవాఖానల్లో వ్యాక్సిన్ కొరత

- పెంటా వ్యాక్సిన్ లేక పసి పిల్లల ఇబ్బందులు
- నెల రోజులుగా అందని వైనం

పాలకుర్తి, మార్చి7: ప్రజా పాలనలో ప్రభుత్వ దవాఖానల్లో పెంటావ్యాక్సిన్ కొరతతో పసి పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి.. పాలకుర్తి మండలంలో 11 సబ్ సెంటర్లు, నాలుగు పల్లె దవాఖానలు ఉన్నాయి. వీటి పరిధిలోని ఏఎన్ఎంలు చిన్నారులకు ఇచ్చే ఐపీవీ పెంటా వ్యాక్సిన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది లోపు చిన్నారులకు సబ్సెంటర్లలో ఈ వ్యాక్సిన్ టీకా వేస్తారు. దీని కోసం వారి తల్లిదండ్రులు నెల రోజుల నుంచి ఎదురు చూస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యాక్సిన్ కొరత ఏంటిదని ఏఎన్ఎంలను నిలదీస్తున్నారు. వ్యాక్సిన్ రావడం లేదని, మేమేం చేయాలని వారు బదులిస్తున్నారు. ప్రభుత్వం చిన్నారి పిల్లల జీవితాలతో ఆటలాడొద్దని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగిని వివరణ అడగగా ఐపీవీ పెంటా వ్యాక్సిన్ కొరత ఉన్న మాట వాస్తవమేనన్నారు. జిల్లాలో కూడా రావడం లేదని తెలిపారు.

దేవన్నపేటలో బెల్లం, పట్టిక పట్టివేత

నయింనగర్, మార్చి7: అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను శుక్రవారం కేయూ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవన్నపేట క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాలీలో దాదాపు రూ.1,20,000ల విలువైన 15 క్వింటాళ్ల బెల్లం, రూ. 8400ల విలువైన 140 కిలోల పటిక పట్టుబడినట్లు తెలిపారు. దీంతో ట్రాలీని సీజ్ చేసి, మాలోత్ నరేశ్(27), లావుడ్యా రవీందర్ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. బెల్లం, పటికను నిందితులు జహీరాబాద్ నుంచి కొనుగోలు చేసి గూడూరు మండలం అప్పరాజుపల్లి తీసుకెళ్తున్నట్లు ఒప్పు కున్నట్లు చెప్పారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 41,422

ఖిలావరంగల్, మార్చి 7: వరంగల్ జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 41,422 వచ్చినట్లు కలెక్టర్ సత్యశారద తెలిపారు. ఎల్ఆర్ఎస్పై హైదరాబాద్ నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం దానకిశోర్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్ నుంచి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు 15,341 దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. 199 దరఖాస్తులకు చెల్లింపులు చేశామని, మిగతా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, జడ్పీ సీ ఈవో రాంరెడ్డి, బల్దియా అదనపు కమిషనర్ జోనా, ఉపకమిషనర్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వృద్ధుడికి గాయాలు

కాజీపేట, మార్చి 7 : రహ్మత్ నగర్లో శుక్రవారం రాత్రి మసీదుకు వెళ్లి వస్తున్న బషీరుద్దీన్ (80)పై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయ ప రిచాయి. స్థానికులు అప్రమత్తమై వాటిని తరిమేశారు.

ఒకరి అదృశ్యం

కరీమాబాద్, మార్చి 7: అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని కరీమాబాద్కు చెందిన వెన్నం రమేశ్ అదృశ్యమైనట్లు అతడి భార్య లలిత శుక్రవారం మిల్స్కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో గొడవపడి గత నవంబర్లో వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆక్సీజన్ ఫ్లో మీటర్ పేలి స్వీపర్కు గాయాలు

స్వీపర్ను క్యాజువాలిటీకి తరలిస్తున్న సిబ్బంది

వరంగల్ చౌరస్తా, మార్చి7: వరంగల్ ఎంజీఎం హాస్పిటల్లో అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది ప్రాణాల మీదకు తెస్తున్నది. యంత్ర పరికరాల కొనుగోలు విషయంలో అధికారులు నాణ్యతా ప్రమాణాలు పట్టించుకోక పోవడం వల్లే ఇలా జరుగుతున్నదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఎంజీఎం ఆర్థోపెడిక్ వార్డులో నిల్వ ఉన్న ఆక్సీజన్ సిలిండర్ను మరో వార్డుకు తరలించడానికి స్వీపర్ పిల్లల జ్యోతి(30) ప్రయత్నిస్తున్న సమయంలో ఫ్లోమీటర్ పేలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా లిక్విడ్ ఆక్సీజన్ ఎక్కువ మొత్తంలో విడుదల కావడంతో బాధితులు వాంతులు చేసుకున్నారు. వెంటనే సిబ్బంది బాధితురాలిని క్యాజువాలిటీకి తరలించి వైద్యసేవలు అందించారు. నాణ్యతాప్రమాణాలు పాటించక పోవడం మూలంగానే ఈ ఘటన చోటుచేసుకుందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. వేసవి ప్రారంభంకాక ముందే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడంపై రోగులు సైతం ఆందోళనకు గురవుతున్నారు. ఆక్సీజన్ సిలిండర్ల నిర్వహణ వార్డు బాయ్స్ చేయాల్సి ఉండగా స్వీపర్తో చేయించడం ఏంటని మహిళా సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు కేయూకు పని దినం..

హనుమకొండ చౌరస్తా, మార్చి 7 : కాకతీయ యూనివర్సిటీకి శనివారం పనిదినంగా ప్రకటిస్తూ రిజిస్ట్రార్ రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఉద్యోగుల కోరిక మేరకు జనవరి 15న (కనుమ పండుగ) సెలవు దినంగా ప్రకటించామని, దానికి బదులుగా మార్చి 8న (రెండో శనివారాన్ని) పనిదినంగా ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గుప్తనిధుల తవ్వకాలు.. ఐదుగురిపై కేసు

మహదేవపూర్, మార్చి 7 : గుప్త నిధుల కోసం తవ్వకాలకు పాల్పడిన వారిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్కుమార్ తెలిపారు. మండల పరిధిలోని ఎన్కపల్లి గ్రామంలో కొందరు అనుమానితులు పరికరాలతో గుప్త నిధుల కోసం ప్రయత్నిస్తున్నారనే సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆదిలాబాద్కు చెందిన ఇంజాపూర్ వెంకటరమణ, జనగాం జిల్లా, చిల్పూరు మండలం శ్రీపతిపల్లికి చెందిన పల్లెపు నరసింహా, భువనగిరి జిల్లా చౌదర్పల్లికి చెందిన షేక్ షరీఫొద్దిన్, రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలానికి చెందిన ఎండీ రియాజ్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన పిల్లి అశోక్ కుమార్ అనే ఐదుగురిని పట్టుకున్నారు. సూత్రధారుడైన సమ్మయ్య అనే వ్యక్తి పరారైనట్లు ఎస్సై తెలిపారు. నిందితుల వద్ద నుంచి డిజిటల్ మెటల్ డిటెక్టర్ పరికరం, తవ్వడానికి వినియోగించే పరికరాలతోపాటు కారు, వస్తువులను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

పాలెంవాగు ప్రాజెక్టు గుట్టల్లో హనీబ్యాడ్జర్



వెంకటాపు రం(నూగూ రు), మార్చి 7 : పాలెంవాగు ప్రాజెక్టు సమీప గుట్టలపై అరుదైన జంతువు హనీబ్యాడ్జర్ కనిపించినట్లు అటవీ శాఖ అధికారి వంశీ కృష్ణ తెలిపారు. శుక్రవారం అటవీ జంతువుల కోసం అమర్చిన ఉచ్చులో అది చిక్కుకున్నట్లు తెలుసుకున్న సిబ్బంది దానిని తీసి అడవిలో వదిలిపెట్టారు. సెక్షన్ అధికారి దేవయ్య, బీట్ ఆఫీసర్ ప్రణవి, సరళ, బేస్ క్యాంపు సిబ్బంది ఉన్నారు.

ములుగు ఓఎస్డీ బదిలీ

ములుగు, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా ఓఎస్డీ గీతే మహేశ్బాబా సాహెబ్ ఉద్యోగోన్నతి పొంది రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. 2020 ఐపీఎస్ బ్యాచ్కు చెందిన ఆయన ములుగు జిల్లాలో గతంలో ఏటూరునాగారం ఏఎస్పీగా విధులు నిర్వర్తించి అనంతరం ఓఎస్డీగా బాధ్యతలు చేపట్టారు.